కాపాడేవారు లేరా..?

- ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో వెలుస్తున్న వెంచర్లు, సంస్థలు, ఇళ్లు
- గాలికొదిలేసిన యంత్రాంగం

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

ప్రభుత్వ స్థలంలో ఎవరైనా పేదలు గుడిసె వేసుకుంటే నానా హంగామా చేసే అధికారులు వాటిని కూల్చేవరకు ఊరుకోరు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణే తమ కర్తవ్యమంటారు. బడాబాబులు, రాజకీయ నేతల అనుచరులు ఏకంగా ఎకరాల కొద్దీ భూములు ఆక్రమిస్తున్నా పట్టించుకోరు. ఒకవేళ కట్టడికి ముందుకు కదిలినా ఎక్కడికక్కడ నేతలు వారిని అడ్డుకుంటారు.

– సాక్షి,సిటీబ్యూరో

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 11,384 ఎకరాల అసైన్డ్ భూములు, 5,195 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా వాటికి రక్షణ లేకపోవడంతో అన్యాక్రాంతమవుతున్నాయి. ఇప్పటికే సగం భూములు ఆక్రమణకు గురై వెంచర్లు, విల్లాలు, ఇండిపెండెంట్ ఇళ్లు, పలు సంస్థలుగా మారటంతో వాటిని స్వాధీనం చేసుకోవటం కష్ట తరమవుతోంది. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఉన్న కొద్ది పాటి భూములకైనా ఫెన్సింగ్, బోర్డులు లేక పోవటంతో.. భూకబ్జాదారులు నకిలీ పత్రాలు సృష్టించి యథేచ్ఛగా వాటిని ఆక్రమిస్తున్నారు. అలాగే, చెరువులు, కుంటల బఫర్ జోన్లు, శిఖం భూముల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై కూడా రెవెన్యూ అధికార యంత్రాంగం కన్నెత్తి చూడక పోవడం వారికి వరంగా మారుతోంది.

కబ్జాల పర్వం ఇలా...

కాప్రా మున్సిపల్ సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్ 199/1 జమ్మిగడ్డలోని స్టేడియానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి, ప్లాట్లు చేసి, ఇళ్లు నిర్మించి రూ.15 నుంచి రూ.20 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు.

- ఓల్డ్ మల్లాపూర్ పరిధిలోని ఎన్ఎఫ్సీకి ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 24లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు సన్నాహాలు చేపట్టారు.
- కీసర గ్రామంలోని సర్వే నంబర్ 131లో 105.26 ఎకరాల ఫారెస్టు భూమి ఉండగా, ఓ వ్యక్తి దొంగ కాగితాలను సృష్టించి... 2 ఎకరాల స్థలంలో బండరాళ్లను పగులగొట్టి, స్థలాన్ని చదును చేసి, భవన నిర్మాణ పనులు ప్రారంభించినా ఫారెస్టు , రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవటం లేదు. ఈ భూకబ్జాపై స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- కీసర రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 825లో 7.08 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల కబ్జాలో ఉండగా, అదే ప్రాంతంలోని 181 సర్వే నంబరులోని 2 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.
- బోడుప్పల్ పరిధిలోని సర్వే నంబరు 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, 1974 నుంచి ఆక్రమణకు గురవుతోంది. అప్పట్లో బోడుప్పల్ గ్రామ పంచాయతీగా ఉండటంతో ఓ భూకబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ జీపీ లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు విక్రయించాడు. ప్రస్తుతం అదే ప్రభుత్వ స్థలాన్ని స్థానిక రాజకీయ నాయకులతో కలిసి గజం రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నారు.
- బోడుప్పల్‌లో పార్కు, శ్మశాన వాటికకు చెందిన 2611 గజాల స్థలంతోపాటు అక్షయ నగర్‌లో 509 గజాలు, వెంకటేశ్వర్‌నగర్‌లో 350 గజాల పార్కుల స్థలం అన్యాక్రాంతమవుతోంది.
- ఫీర్జాదిగూడలోని 13 కాలనీల్లోని 3 ఎకరాల పార్కుల స్థలాలు కూడా కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. చెంగిచర్ల చింతల కుంట చెరువు కట్ట సంబంధించిన భూముల్లో అక్రమంగా బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.



- దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని అహ్మద్‌గూడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 51లో రెండెకరాలు. సర్వే నంబర్ 504లో 3.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. సర్వే నంబర్ 22లో పార్కు స్థలం కబ్జాకు గురైంది. దమ్మాయిగూడలోని సర్వే నంబర్లు 530లో 2 ఎకరాలు , 574లో 2.13 ఎకరాలు, బండ్లగూడలోని సర్వేనంబర్74లో అన్యాక్రాంతమయ్యాయి.
- నాగారంలోని 297 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా... రెవెన్యూ శాఖలో చలనం రావడం లేదు. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములకు కబ్జాకు గురయ్యాయి.
- చీర్యాల గ్రామంలోని సర్వేనంబర్ 7,8లలో 12.5 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించారు. ఇదే రెవెన్యూ గ్రామంలో సర్వేనంబర్ 152/2లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి విక్రయించారు.
- గాగిల్లాపూర్‌లోని 214 సర్వే నంబరులో 57 ఎకరాల అసైన్డ్ భూమిలో 40 ఎకరాలు, డి.పోచంపల్లిలో 120 సర్వే నంబరులో 152 ఎకరాల అసైన్డ్ భూమిలో 60 ఎకరాలు కబ్జా గురైనట్లు తెలుస్తోంది.
- నిజాంపేటలోని 332, 233, 334 సర్వే నంబర్లలోని 300 ఎకరాల్లో సగం భూములను కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకున్నారు.
- గాజుల రామారంలోని సర్వే నంబర్లు 307, 329,79,307లలోని 30 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా గురైనా పట్టించుకునేవారు లేరు.
- శామీర్‌పేట్‌లో రియల్టర్లు తమకున్న 45 ఎకరాలకు పక్కనున్న 10 ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేసినా రెవెన్యూ అధికారుల్లో స్పందన లేదు.
- జవహర్‌నగర్‌లో దాదాపు 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఇందులో ప్రైవేట్ ఆసుపత్రితోపాటు ఇతర సంస్థల నిర్మాణాలు కూడా చేపట్టారు.
- ఘట్కేసర్, కాచగాని సింగారం, చౌదరిగూడ ,ప్రతాప్ సింగారం, ఫీర్జాదిగూడ, పర్వాతాపూర్, మేడిపల్లి, పోచారం ప్రాంతాల్లోనూ వందలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు కబ్జాకు గురైనట్లు అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు అందుతున్నా... పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



రూ.500 బోనస్‌తో సన్న వడ్లు కొనుగోలు చేయాలి



సాక్షి, సిటీబ్యూరో: రేషన్ కార్డుదారులకు జనవరి–2025 నుంచి సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.500 అదనపు బోనస్‌తో సన్న వడ్లు. కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో వర్షాకాలానికి సంబంధించి ధాన్యం సేకరణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణ బాయి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రకళ, జిల్లా కో ఆపరేటివ్ అధికారి వెంకట్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు ధాన్యం సేకరణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు , రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముందుస్తుగా రైతులను తడి, తాలు, దుమ్ము లేకుండా తూర్పారబట్టి, ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చైతన్యం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరికోత సమయంలో వరినూర్పిడి యంత్రాల వారితో మాట్లాడి క్రమపద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చేలా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో కొనుగోలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకే కేంద్రంలో సన్న, దొడ్డు రకం వడ్లకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. రైస్ మిల్లులకు కూడా వేర్వేరుగా ధాన్యాన్ని తరలించేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో నేరుగా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేలా సంబంధిత అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు..

పని చేసే వారికి పార్టీలో గుర్తింపు



జెకె శేఖర్ యాదవ్

కుత్బుల్లాపూర్ : పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరిని అధిష్టానం గుర్తించి పదవులు కట్టబెడుతుందని, నాలుగు సంవత్సరాలుగా పార్టీ కోసం పని చేయడం వల్లే అధిష్టానం తనకు నియోజకవర్గ కన్వీనర్ బాధ్యతలు అప్పగించిందని జెకె శేఖర్ యాదవ్ అన్నారు. నియోజకవర్గంలో సీనియర్లు బీజేపీకి దూరంగా ఉంటున్న విషయంపై 'సాక్షి'లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసే వారికి తప్పకుండా తాము గుర్తింపు ఇస్తామని, ఇందులో సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా ముందుకు సాగుతున్నామన్నారు. 2019 నుంచి బీజేపీలో ఉంటున్న తనకు ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో పార్టీ అధిష్టానం బాధ్యతలను అప్పగించిందన్నారు. కొంత మంది సీనియర్ నాయకులు పార్టీని బదనాం చేయడం సరికాదన్నారు. అందరినీ కలుపుకుని పని చేస్తామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామన్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సుభాష్‌నగర్: భారతదేశ రాజకీయ ఏకీకరణకు వల్లభాయ్ పటేల్ ప్రముఖ పాత్ర పోషించారని సూరారం నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్‌ముదిరాజ్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భాగ్యరథి కళాశాల విద్యార్థి



లక్ష్మీ శ్వేతన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో భాగ్యరథి జూనియర్ కళాశాల విద్యార్థి సత్తా చాటాడు. ఎంపీసీ విద్యార్థి లక్ష్మీ శ్వేతన్ రాష్ట్ర స్థాయి పోటీకి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. తమ కళాశాల నుంచి నేషనల్ ప్లేయర్ ఈషా, ప్రస్తుతం లక్ష్మీ శ్వేతన్ విద్యార్థులు బ్యాడ్మింటన్‌లో రాణిచండం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు గోవిందరెడ్డి, రామకృష్ణ, రమేష్ బాబు, జైశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వల్లే విద్యుత్ చార్జీల పెంపు విరమణ



సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నేతలు

దుండిగల్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించిన సందర్భంగా గండిమైసమ్మలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం సంబురాలు నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నేతృత్వంలో ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం కొనసాగిస్తున్నామన్నారు. విద్యుత్ చార్జీల పెంపును తిరస్కరించడంలో బీఆర్ఎస్ పార్టీ కీలకంగా వ్యవహరించిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, నిజాంపేట కార్పొరేటర్లు సుజాత, బాలాజీ నాయక్, దుండిగల్ వైస్ చైర్మన్ పద్మారావు, డివిజన్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు కిట్ల పంపిణీ

సుభాష్‌నగర్: ట్రాఫిక్ పోలీసులు ఓ వైపు విధులు నిర్వహిస్తూ, మరోవైపు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో 51 మంది సిబ్బందికి కిట్లను అందజేశామన్నారు. ఈ కిట్లలో సిబ్బందికి కంటి అద్దాలు, వాటర్ బాటిల్, బ్యాగ్, రెయిన్‌కోట్ ఉంటాయని తెలిపారు. వీటివల్ల ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు ఆరోగ్యం పట్ల ఇబ్బంది కాకుండా దోహదపడతాయన్నారు.



కిట్లను అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

సంక్షేమ సంఘాలతోనే కాలనీలు అభివృద్ధి



కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన పద్మానగర్ ఫేజ్–1 సంక్షేమ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలతోనే కాలనీలు అభివృద్ధి చెందుతాయని, అందరు కలిసికట్టుగా స్థానిక సమస్యలను పరిష్కరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్, పద్మానగర్ ఫేజ్ –1 కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం కమిటీ సభ్యులను శ్రీశైలంగౌడ్ సన్మానించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డిని కూడా కలిశారు. కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సత్తిరెడ్డి, దయాకర్, ముత్యాలు, వెంకటేశ్వరరావు, శివ నాగిరెడ్డి, జై సింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ప్రసాద్, అరవింద్, సత్యం, వేణుమోహన్, సుబ్బారెడ్డి, రంగసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, సందీప్ రెడ్డి, వినోద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలురకు గాయాలు

పతంగి ఎగరవేస్తుండగా ప్రమాదం



తీవ్రంగా గాయపడ్డ ఆదిల్, ఆజామ్

సుభాష్‌నగర్: గాలిపటం ఎగరేస్తున్న క్రమంలో మాంజా విద్యుత్ వైర్లకు తగలడంతో ఇద్దరు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. గాజులరామారం డివిజన్ అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఆజాం (12), ఆదీల్ (10) ఇద్దరు కలిసి బుధవారం మధ్యాహ్నం బస్తీ దవాఖాన వద్ద పతంగి ఎగరవేస్తున్నారు. ఈ క్రమంలో పతంగి విద్యుత్ వైర్లకు చిక్కడంతో బలంగా లాగారు. ఈ క్రమంలో రెండు విద్యుత్ వైర్లు ఒకే వద్ద తగలడంతో మాంజాకు విద్యుత్ సరఫరా కావడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. రెండు వైర్లు కలవడంతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెద్ద శబ్దం వచ్చింది. దవాఖానలోని సిస్టం, వైర్లు కాలిపోయాయి. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మురుగు పారుతున్నా పట్టించుకోరా?



ప్రశాంతి గోల్డెన్ హిల్స్ కాలనీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

నిజాంపేట్: భూగర్భ డ్రైనేజీ లైన్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో రోడ్లపై మురుగునీరు ఏరులై పారుతోంది. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతి నగర్‌లోని ప్రశాంతి గోల్డెన్‌హిల్స్ కాలనీ ప్రధాన రోడ్డులో కొన్ని రోజులుగా మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు పొంగి పొర్లుతోంది. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ చీఫ్ విప్‌కు సన్మానం



నిజాంపేట్: ప్రభుత్వ చీఫ్ విప్, శాసన మండలి సభ్యుడు పట్నం మహేందర్‌రెడ్డిని బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందేసి సత్కరించారు. ఆయన వెంట ఆవుల జగన్‌యాదవ్, నాగరాజ్‌యాదవ్, తలారి సాయిముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో దీపావళి సంబరాలు

దీపావళి ఉత్సవాలు ఒక రోజు ముందుగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. పలు పాఠశాలల్లో దీపావళి పూజలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి టపాసులు కాల్చారు.

– కుత్బుల్లాపూర్



సుభాష్‌నగర్‌లోని బోధి వృక్షా ఒలింపియాడ్ స్కూల్‌లో..



అపురూపా కాలనీలోని టీవీఆర్ మోడల్ హైస్కూల్‌లో..



చింతల్ బచ్‌పన్ స్కూల్‌లో



సూరారం కాలనీ నార్త్‌సిటీ హైస్కూల్‌లోని బొమ్మల కొలువు



దీపావళి దొంతులతో ముస్తాబు చేసిన మహిక

మున్సిపల్ కార్మికులకు చీరలు అందజేత



చీరలు అందజేస్తున్న ప్రసాదరాజు తదితరులు

నిజాంపేట్: బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో బుధవారం కౌశల్య కాలనీలో మున్సిపల్ వర్కర్లను సత్కరించారు. వారికి దీపావళి కానుకగా చీరలు, స్వీట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్, ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి, సోషల్ మీడియా కన్వీనర్ సురేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఉదయ్ కిరణ్, బీజేవైఎం అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, రమణ రాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు పండుగ కళ




కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న షాపూర్‌నగర్ మార్కెట్

సుభాష్‌నగర్: దీపావళి పండుగ నేపథ్యంలో బుధవారం షాపూర్ నగర్ మార్కెట్‌కు జనాల తాకిడి పెరిగింది. పండుగ నిమిత్తం పూజా సామగ్రి కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి రావడంతో మార్కెట్ ఉదయం నుంచి రాత్రి వరకు జనాలతో కిక్కిరిసిపోయింది.

అనాథ ఆశ్రమంలో అన్నదానం



దుండిగల్: దీపావళి పండుగను పురస్కరించుకుని హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు అనాథాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. దుండిగల్‌లోని పల్లవి మానసిక దివ్యాంగుల అనాథాశ్రమంలో 60 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మండలాపురం చైతన్య కృష్ణ, జీహెచ్ఎంసీ అధ్యక్షుడు ఎన్ వృతిక్, జహీరాబాద్ తాలూకా అధ్యక్షుడు డి సాయినంద్ రెడ్డి, ఆశ్రమ నిర్వాహకురాలు శ్రీదేవి, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప పూజా విధానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అయ్యప్ప ఆలయ చైర్మన్ కొలను చంద్రశేఖర్, కోడెం గోపి గురుస్వామి తదితరులు – నిజాంపేట్